క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక పూజలు చేసిన ఆమంచి



పూజలు చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

మార్టూరు: మార్టూరులోని సయ్యద్ కరిముల్లా షా దర్గాకు సంబంధించిన 47వ ఉరుసు మహోత్సవంలో భాగంగా పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం రాత్రి స్థానిక నాయకులతో కలసి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు ఆమంచికి ఘన స్వాగతం పలికారు. దర్గా ముజువర్లు పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు. ఆమంచి వెంట నాయకులు, సీఐ ఎస్కే ఫిరోజ్ తదితులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక లోక్ అదాలత్

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవన సముదాయంలో శనివారం నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శుభవాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే లోక్ అదాలత్‌లో కుటుంబ తగాదాలు, వినియోగదారుల ఫిర్యాదుల వంటి వాటిని కక్షిదారులు పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి కోరారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

చీరాల రూరల్: విజయవాడ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న మహిళా న్యాయవాది పెరుమాళ్ల ఉషారాణిపై కొందరు విచక్షణా రహితంగా దాడిచేసినందుకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. శుక్రవారం ఒంగోలు జిల్లా కోర్టు న్యాయవాదులు ఇచ్చిన పిలుపుమేరకు చీరాల కోర్టు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాగంటి జ్ఞానేశ్వరరావు, నీలి కస్తూరినాథ్‌లు మాట్లాడారు. నిరంతరం కక్షిదారులకు న్యాయ సహాయమందించడంతో నిమగ్నమయ్యే న్యాయవాదులపై ఈ మధ్య కాలంలో ప్రతి చిన్న విషయానికి దాడులు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న చిన్న ఉద్యోగికి సైతం ఆయా శాఖలు రక్షణ కల్పిస్తుంటే న్యాయవాదులకు మాత్రం రక్షణ చట్టాలు కల్పించకపోవడం దుర్మార్గమైన అంశమన్నారు. తక్షణమే ప్రభుత్వాలు మేల్కొని న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని వారు కోరారు.

జానపద కళోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జానపద కళాపీఠం సభ్యులు

అద్దంకి రూరల్: జానపద కళాపీఠం 22వ వార్షిక జానపద కళోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం రాత్రి స్థానిక గీతామందిరంలో నిర్వహించిన కళాపీఠం సభ్యుల సమావేశంలో అధ్యక్షుడు దేవపాలన, సభ్యులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈనెల 25న స్థానిక బంగ్లారోడ్‌లో ఉదయం 9 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రికి సాహిత్య కళా పురస్కార సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జానపద కళాపీఠం సభ్యులు చెన్నుపల్లి నాగేశ్వరరావు, గాడేపల్లి దివాకరదత్తు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, జ్యోతి చంద్రమౌళి, వై రమేష్‌బాబు, బాబూరావు, చుండూరి మురళీ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జ్యోతి రమేష్ పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం శ్రవణం నక్షత్రం ఏకాదశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అకాల వర్షంతో రైతుల ఇబ్బందులు



కారంచేడులో పరదాలతో కప్పిఉంచిన మిరప

చీరాల: ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అకాల వర్షం రైతులకు కష్టం మిగిల్చింది. అందరికి పట్టెడన్నం పెట్టే రైతన్న ఇంటికి ధాన్యం సిరులు చేరే సమయంలో అకాల వర్షం కారణంగా చీరాల ప్రాంతంలో వరిపంటకు నష్టం వాటిల్లింది. పంట నూర్పిడిలు అయి ధాన్యం ఆరబెట్టగా శుక్రవారం వేకువజాము నుంచి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోంది. అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తుండటంతో రైతన్నలు ధాన్యాన్ని కాపాడుకునే యత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. చీరాల నియోజకవర్గంలోని పేరాల రెవెన్యూ డివిజన్‌తో పాటుగా రూరల్ గ్రామాల్లో రెండున్నర వేల ఎకరాల్లో వరి పంట పంటను సాగు చేశారు. ఈ ఏడాది వాతావారణం అనుకూలించడం, సకాలంలో సాగు నీరు లభ్యం కావడంతో వరిపంట ఎకరానికి అధికంగా దిగుబడి వచ్చింది. పంట దిగుబడులు బాగా వచ్చాయనే ఆనందాన్ని అకాల వర్షం చివరికి కంటి వెంట నీరు తెప్పించింది. వరిపంట ఒక్కో ఎకరానికి రూ.40 వేలు వరకు సాగు ఖర్చు అయ్యింది. కల్లాల్లోనే వరి పంట నూర్పిడిలు పూర్తి చేసి ధాన్యాన్ని పంట పొలాల్లోనే ఆరబెట్టగా వర్షం కారణంగా ధాన్యం వర్షార్పణం అయ్యింది. అన్నదాతపై వరుణుడు కనికరం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. తడిచిన దాన్యం మొలకెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. ఎకరానికి సాగు ఖర్చులు పోను ఈ ఏడాది కొద్దిగా లాభం వస్తుందని ఆశించిన రైతుల ఆశలు అడియాసలుగా మారాయి. ప్రభుత్వం తమను ఆదుకుని తడిచిన దాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటుగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం కుప్పల్లోకి నీరు చేరిన రైతుల పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. తడిచిన ధాన్యం ఆరబెట్టేందుకు ప్రత్యామ్యాయ చర్యలు తీసుకోవడంతో రైతులకు పలు సూచనలు అందించారు.

కారంచేడులో భారీ వర్షం..

కారంచేడు: గురువారం అర్ధరాత్రి నుంచి కారంచేడు మండలంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వాతావరణ శాఖతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో అన్నదాతలు అప్రమత్తమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో అకాల వర్షం కురిస్తే ఇప్పటికే కల్లాల మీద ఉండాల్సిన మిరప, పొగాకు, వరి పంటలకు నష్టం వాటిల్లేది. కానీ వాతావరణ శాఖ, ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. దీంతో అన్నదాతలు ముందగానే వ్యవసాయ శాఖ, ఆర్‌బీకేల సహకారంతో పరదాలను ఏర్పాటు చేసుకున్నారు. వాతారణంలో వచ్చిన మార్పులను గమనించిన రైతులు వెంటనే కల్లాల్లోని మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలపై పరదాలు కప్పుకున్నారు. భారీ వర్షాలు కురిస్తే మాత్రం చెట్టుకు ఉన్న మిరప కాయలు తాలు కాయలయ్యే ప్రమాదముందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు.

కొనుగోలు కేంద్రంతో మద్దతు ధర



శనగల కొనుగోలును ప్రారంభిస్తున్న చైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: శనగల కొనుగోలు కేంద్రంతో రైతుకు మద్దతు ధర దక్కుతుందని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని మణికేశ్వరం గ్రామ సొసైటీ వద్ద శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏనాడూ లేని విధంగా రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి అదే ధరకు ప్రభుత్వమే గత మూడేళ్ల నుంచి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తోందని చెప్పారు. దీంతో దళారులతో రైతు దగా పడే పరిస్థితి పోయిందన్నారు. శనగలు క్వింటా రూ.5,335 రైతుకు ఇస్తుందని చెప్పారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటే, దాని ప్రకారం, కొనుగోలు కేంద్రం వద్దకు రైతు శనగల శాంపిల్‌ను తీసుకెళ్తే తేమ శాతం గుర్తింపుతో కొనుగోలు చేస్తారని చెప్పారు. మండలంలో నాగులపాడులోనూ కేంద్రం ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మణికేశ్వరం సొసైటీ ఛైర్మన్ సోమా శ్రీనివాసరెడ్డి, ఈదా శ్రీనివాసరెడ్డి, మందా నాగయ్య, ఎంపీటీసీ దాసరి దానియేలు, అనమనమూరు సర్పంచ్ జంపు హరిబాబు, అవిశన ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

- మొక్కజొన్న పైరును పరిశీలించిన శాస్త్రవేత్తలు
- మట్టి నమూనాల సేకరణ
- న్యాయం చేయాలన్న బాధిత రైతులు

జే.పంగులూరు: మొక్కజొన్న విత్తనంతో నష్టపోయిన రైతులకు ఆదుకుంటామని శాస్త్రవేత్తలు అన్నారు. కొండమంజులూరు గ్రామంలో నకిలీ మొక్కజొన్న విత్తనాల సాగుతో మోసపోయిన రైతుల పొలాలను శుక్రవారం లాంఫాం, బాపట్ల అగ్రానమీ సైంటిస్టులు పరిశీలించారు. పొలంలో తిరిగి పైరును, భూమిని పరిశీలించి, రైతులతో మాట్లాడి మట్టి నమూనాలను పరిశీలన నిమిత్తం తీసుకెళ్లారు. కొండమంజులూరు గ్రామానికి చెందిన బత్తుల ఆంజనేయులు, కొలకలూరి ఏసోబులు భారతి 756 రకం మొక్కజొన్న విత్తనం నాటి 50 రోజుల దాటిన పైరులో ఎదుగుదల లేదు. పైరు రంగులో కూడా మార్పు వచ్చి ఆకులు ముడుచుకుపోవడం కండె కూడా సన్నగా రావటం, అందులో విత్తనాలు చాలా తక్కువగా ఉండటంతో వలన రైతులు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి చూపించారు. ఆయన పైరు పరిస్థితి పరిశీలించిపై అధికారులకు తెలపడంతో అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం నగేష్, బ్రీడింగ్ డిపార్ట్‌మెంట్ సైంటిస్ట్ డాక్టర్ వై పుష్పరేణి, అగ్రానమీ డిపార్ట్ సైంటిస్ట్ డాక్టర్ కే మృదుల పైరును పరిశీలించారు. అది విత్తనంలో తేడానా లేక భూమిలో అన్నది పరిశీలించి చెప్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు మట్టినమూనాలను, కండెలను తీసుకెళ్లారు. వాటిని పరిశీలించి 10 రోజుల్లో వివరాలు వెల్లడిస్తారని పేర్కొన్నారు. విత్తనంలో ఎదైనా తేడా ఉంటే కంపెనీ ద్వారా నష్ట పరిహారం కోరే అవకాశం ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాను బాధిత రైతులు బత్తుల ఆంజనేయులు, కొలకలూరి ఏసోబు పొలాలను పరిశీలించి జేడీఏ ద్వారా శాస్త్రవేత్తలు తెలియజేసినట్లు తెలిపారు. రైతు సంఘం నాయకలు తల్లపనేని రామారావు మాట్లాడుతూ నకిలీ విత్తనాల వలన నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారును డిమాండ్ చేశారు. శాస్త్రవేత్తలు వెంటనే పరిశీలించి సమాచారం తెలిపి, కంపెనీ నుంచి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.



ఎదుగు బొదుగు లేని మొక్క

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్



శిక్షణ తరగతికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

- గృహ సారథుల శిక్షణ తరగతుల్లో ఆమంచి కృష్ణమోహన్

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకురావడంలో అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మీరంతా వారధులుగా ఉండాలని చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడులో డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపంలో ఎంపీపీ నీరుకుట్టు వాసుబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండలస్థాయి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల ఒక్కరోజు శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై వారికి దిశ, నిర్దేశం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న మేనిఫెస్టోలో ఇచ్చిన నవరత్నాలు అమలు తీరును, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గృహసారథుల్లో 50 శాతం మంది మహిళలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చుండూరు రవి మాట్లాడుతు గ్రామాల్లో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంగా పనిచేయాలన్నారు. ఇంటింటికీ అంటించే మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌లు, బ్రోచర్లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, పర్చూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ జువ్వా శివారాం ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆదిపూడి సొసైటీ అధ్యక్షుడు యర్రం లక్ష్మారెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్ అహ్మద్, స్వర్ణ సర్పంచ్ మోటాని మధుసూదనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్, దగ్గుబాటి రామకృష్ణ, యార్లగడ్డ పాపారావు, సుబ్బారాయుడు, జీ బాబూరావు, బసవయ్య, నూతలపాటి జోనేష్, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే ఫలితాలు



మాట్లాడుతున్న వైద్యాధికారి అహ్మద్

బల్లికురవ: వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో మతా శిశు సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యధికారి రమీజ్ అహ్మద్ కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పీహెచ్‌సీలో అంగన్‌వవాడీ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, ఐదేళ్లలోపు చిన్నారులకు రక్తహీనత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనుమోల్ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఉంచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ప్రేమలీల, కోటేశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు..

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపై తెగిపడిన తీగ



రోడ్డుపై తెగి పడిన 11 కేవీ విద్యుత్ తీగ

వేటపాలెం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో జెడ్పీ బాలికోన్నత పాఠశాల ముందు అకస్మాత్తుగా 11 కేవీ విద్యుత్ తీగ శుక్రవారం తెగి రోడ్డుపై పడింది. హైస్కూల్ ప్రధాన గేటు ముందు రోడ్డుపైనే వైరు తెగి పడింది. అప్పటివరకు అక్కడే ఉన్న విద్యార్థులు తీగ కిందపడిన సమయంలో వస్తున్న మంటలతో అప్రమత్తమై ప్రమాదాన్ని గ్రహించి పక్కకు పరుగులు తీశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు సమాచారం అందించడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఘనంగా కరిముల్లాషా ఉరుసు మహోత్సవం



దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు



గన్నవరం రోడ్డులో ఎలక్ట్రికల్ లైటింగ్

మార్టూరు: మార్టూరులోని కొణిదెన రోడ్డులో గల సయ్యద్ కరిముల్లాషా వలి దర్గాకు సంబంధించిన 47 వ ఉరుసు మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన భక్తులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గాతో పాటు గన్నవరం రోడ్డులో ప్రత్యేక ఎలక్ట్రికల్ లైటింగ్‌తో చేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముస్లిం నాయకులు పాట కచ్చేరిలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి 12 గంటలు తరువాత మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు అనంతరం స్థానిక పీర్ల చావిడి నుంచి గంధం ఊరేగింపు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. దర్గా కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మార్టూరు సీఐ ఎస్కే టీ ఫిరోజ్, పోలీసు సిబ్బంది ఏర్పాటు చేసి శాంతి భద్రతలను స్వయంగా పర్యవేక్షించారు.

ప్రైవేట్ స్కూళ్లల్లో సీట్లకు నేటి నుంచి దరఖాస్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వస్రాంనాయక్

మార్టూరు: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేట్ విద్యాసంస్థలో 25 శాతం సీట్ల కోసం నేటి నుంచి ఈనెలాఖరు వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో ఎంసీహెచ్ వస్రాం నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో జీ నితిన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థలో రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పించాలని ఉపాధ్యాయులు, సీఆర్పీలు సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని ఒంగోలు క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వీ శ్రీధర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు మినహా ఇతరులు ఎవరూ లోపలికి అనుమతి లేదన్నారు. ఉద్దేశ పూర్వకంగా ఆటంకం కలిగిస్తే తక్షణమే అధికారులకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ సంపత్‌కుమార్, సిబ్బంది అంజిబాబు, ఎస్.కృష్ణయ్య, ధనలక్ష్మి, అనూషా ఉన్నారు.

మామయ్య కనిపించడంలేదని ఫిర్యాదు

మేదరమెట్ల: తన మామయ్య కనిపించడంలేదంటూ కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన బీ.రామకృష్ణ కొరిశపాడు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. పమిడిపాడు గ్రామానికి చెందిన మర్రిబోయిన వెంకటరత్నం (62) ఒంగోలు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని, తిరిగి ఇంటికి రాకపోవడంతో వెంకటరత్నం అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మంజూరు పత్రాలను మహిళలకు అందజేస్తున్న ఏపీఎం

చినగంజాం: మహిళలు జీవనోపాధులు మెరుగుపరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైఎస్సార్ కేపీ ఏపీఎం అంజిబాబు అన్నారు. ప్రభుత్వం మహిళా గ్రూపులకు అందజేస్తున్న ఆసరా పథకం మూడో విడత పంపిణీ కార్యక్రమంలో భాగంగా మహిళా గ్రూపులతో సమావేశం నిర్వహించారు. ఆసరా పథకం వలన మహిళలు కలిగే ప్రయోజనాలను గురించి మహిళలను చైతన్యపరచే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీసీ శ్రీనివాసరావు, వీఓఏ బీ శివకుమారి, ఆయా గ్రూపుల మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ



నగదు అందిస్తున్న సెక్రటరీ, వెల్ఫేర్

వేటపాలెం: స్థానిక రామన్నపేట-1 సచివాలయ పరిధిలో దేవన పార్వతి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం నగదు రూ. 10 వేల సెక్రటరీ సురేంద్ర శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి మృతురాలి కర్మకాండలకు తక్షణ సహాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వైష్ణవి పాల్గొన్నారు.

70 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: వైద్య వసతి లేని గ్రామీణ ప్రాంతాలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సలు అందిస్తున్నట్లు రామలింగేశ్వర మ్యాక్సివిజన్ వైద్యాధికారి సుధీర్ తెలిపారు. గురువారం రాత్రి వైదన గ్రామంలో ఉచిత శిబిరంలో భాగంగా 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో సర్పంచ్ మేడా జయలక్ష్మీ వైఎస్సార్ సీపీ నాయకుడు మేడా శివదుర్గా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను 108లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

మార్టూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామం సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. బల్లికురవ 108 సిబ్బంది వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పీ స్తుతిరాజు, సీహెచ్ సరోజినిబాబులు ద్విచక్రవాహనంపై సమీపంలోని ఎన్ఎస్‌పీ కెనాల్ వైపు బహిర్భూమికి వెళ్లారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి ఇద్దరు మార్జిన్‌లో పడి పోయారు. 108 సిబ్బంది ఇరువురిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.